# అయిల్‌పామ్ సాగుపై అధ్యయనం



**ప్రజాపక్షం/మునగాల:** రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ సాగులో రైతులు అవలంభించిన ఉత్తమ పద్దతులను డాక్యుమెంట్ చేయడానికి (సిఆర్‌బి) న్యూఢిల్లీకి చెందిన సెంటర్ ఫర్ రెస్పాన్సిబుల్ బిజినెస్ బృందం సభ్యులు సూర్యాపేట జిల్లా మునగాల మండలం ఎస్‌ఎంపేట రెవిన్యూ గ్రామంలో ఆయిల్ ఫామ్ తోటలను సాగు చేస్తున్న కొల్లు రమేష్‌చౌదరి తోటలను సందర్శించి పంట సాగులో రైతులు అవలంభిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఆయిల్ ఫామ్‌తోటలో అంతర్ పంటలుగా ఏ పంటలు పండిస్తున్నారని, రైతులకు ఎదురైనా సమస్యలు ఏమిటని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌బి సీనియర్ ప్రొగ్రామ్ ఆఫీసర్‌లు రజత్‌సి ప్రసిత, మల్లేశ్వరరావు, జిల్లా ఉద్యానవన అధికారి తీగల నాగయ్య, ప్రాంతీయ ఉద్యానవన అధికారి పి. అనిత, విస్తరణ అధికారులు రంగు ముత్యం రాజు, అనిల్, ఆయిల్ ఫెడ్ మేనేజర్ అలీమ్, ఫీల్డ్ ఆఫీసర్ గోపికృష్ణ, తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.


ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
బుధవారం | 15 జులై , 2026 | పేజీలు : 6


## అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టాలు చేయడంలో

# పాలకులు విఫలం

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి




**ప్రజాపక్షం/దేవరకొండ:** అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టాలు చేయడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎఐటియుసి డివిజన్ 10వ మహాసభ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం నిరంతరం రాజీలేని సమరశీల పోరాటాలు చేస్తూ దేశంలో ఏర్పడ్డ మొట్టమొదటి కార్మిక సంఘం ఎఐటియుసి అని అన్నారు. దేశాన్ని బ్రిటిష్ వారు పరిపాలిస్తున్న సమయంలోనే దేశంలోని కార్మికులను ఐక్య పరిచి 1920 అక్టోబర్ 31న బొంబాయి నగరంలో ఎఐటియుసి ఆవిర్భవించిందని నాటి నేటి వరకు కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు నడుపుతుందని అన్నారు. కనీస వేతనాల చట్టం, సంఘం పెట్టుకునే హక్కు సమ్మె చేసే హక్కు ఎఐటియుసి పోరాటాల వల్లనే వచ్చాయని ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా మర్పాలు చేస్తూ 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని అన్నారు. కాంట్రాక్ట్, ఆవుట్ సోర్సింగ్ పేరుతో కార్మికులకు తక్కువ వేతనం చెల్లిస్తూ వెట్టి చాకిరి చేయిస్తున్నారని కనీస వేతనాలు పిఎఫ్, ఈఎస్ఐ చట్టాలు అమలుకు నోచుకోలేదని అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టాలు చేయడంలో పాలకులు పూర్తిగా విఫలం అయ్యారని అన్నారు. కాంట్రాక్ట్, ఆవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతన చట్టాలు అమలు చేయాలని ఎఐటియుసి డిమాండ్ చేస్తుందన్నారు. ఈ మహాసభలో జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి, ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, వెంకట్రాములు, మైనోద్దిన్, వెంకటయ్య, మల్లయ్య, కృష్ణయ్య, జవహార్, లింగ మయ్య, అంజమ్మ, వీరయ్య, ధనలక్ష్మీ, ఝాన్సీ, పద్మ, వెంకటయ్య, రవి పాల్గొన్నారు.

# మిర్యాలగూడ నియోజకవర్గంలో 70.57 శాతం ఓటర్ల 'సర్' మ్యాపింగ్ పూర్తి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో ప్రత్యేక ఓటరు విస్తృత సవరణ సర్వే (సర్) ప్రక్రియ వేగంగా సాగుతోందని, ఇప్పటివరకు నియోజకవర్గంలో 70.57 శాతం మ్యాపింగ్ పూర్తయిందని ఓటరు నమోదు అధికారి, మిర్యాలగూడ ఆర్డీవో ఎస్. రమణారెడ్డి తెలిపారు. మంగళవారం మిర్యాలగూడ సబ్ కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 2,40,574 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు పకడ్బందీగా నిర్వహించిన సర్వే ద్వారా 1,68,252 మంది ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని వివరించారు. ఓటర్లకు తమ ఓటు నమోదు లేదా మార్పులు, చేర్పులపై ఎలాంటి సందేహాలు ఉన్నా స్థానిక బూత్ స్థాయి ను కానీ, తహసిల్దార్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్కను కానీ సంప్రదించవచ్చని సూచించారు. నియోజకవర్గ పరిధిలోని మాడుగులపల్లి మండలంలో అత్యధికంగా 85.78 శాతం మ్యాపింగ్ పూర్తి కాగా, వేములపల్లి మండలంలో 84 శాతం, అడవిదేవులపల్లి మండలంలో 82 శాతం, దామరచర్ల మండలంలో 73.24 శాతం, మిర్యాలగూడ పట్టణ మండలంలో 65.17 శాతం ఓటర్ల మ్యాపింగ్ పూర్తయిందని ఆర్డీవో వివరించారు.

# ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/అడ్డగూడూరు/నూతనకల్/తుంగతుర్తి/ అర్వపల్లి :** తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ జన్మదిన వేడుకలను మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్ట మల్లారెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి మార్కెట్ కమిటి చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, మండల మాజీ అద్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. అభివృద్ధిలో నియోజకవర్గంను ముందుంచుతానని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో తుంగతూర్తి ఎమ్మెల్యే మందుల సామేలు జన్మదిన వేడుకలు మండలకాంగ్రేస్ పార్టీ అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకకు ఎమ్మెల్యే మందుల సామేలు వచ్చి ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టినరోజు నాసొంత మండలంలో ఘనంగా నిర్వహించినందుకు కాంగ్రెస్ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా నాయకులు ఇటికాల చిరంజీవి, బాలెంల సైదులు, బాలెంల విద్యాసాగర్, బొమ్మగాని లక్ష్మ య్య, పాశం సత్యనారాయణ, నిమ్మనగోటి జోజి, పలు గ్రామాల సర్పంచ్, ఉపసర్పంచ్‌లు పాల్గొన్నారు.





# ఎండిపోతున్న పత్తి మొక్కలు

**ప్రజాపక్షం/చందంపేట :** నల్లగొండ జిల్లా చందంపేట మండలంలో సరైన వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల నాటిన పత్తి విత్తనాలకు తగినంత నీరు అందకపోవడంతో పెరిగిన మొక్కలు వాడిపోతున్న పరిస్థితి. వర్షాల కోసం రైతులు ఎదురుచుస్తున్నప్పటికి ఆశించిన స్థాయిలో వర్షాపాతం నమోదు కాకపోవడం, రాష్ట్రంలో పలు జిల్లాల్లో కూడా ఈ సీజన్‌లో లోటు వర్షాపాతం నమోదుకావడం జరిగిందని నివేదికలు సూచిస్తున్నాయి. వర్షాలు ఆశించిన స్థాయిలో పడకపోవడంతో రైతులకు ఆందోళన మొదలై వ్యాపారస్థుల వద్ద అప్పు చేసి మరి విత్తనాలు కొనుగోలు చేసి వర్షాలు లేకపోవడంతో పంట పండే పరిస్థితి లేక వ్యాపారుల వద్ద తీసుకువచ్చిన అప్పు ఎలా చెల్లించాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మండలంలో పలు ప్రాంతాలలో వేసిన పత్తి చేలు ఎండిపోవడంతో రైతుల పెట్టుబడి వృథా అవుతాయామో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోరు బావుల వద్ద వేసిన పత్తి సహితం ఎండల తీవ్రతకు ఎంత నీరు పెట్టినా ఆరిపోతున్నాయని ఇప్పటికైనా వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా అప్పులు తెచ్చి పంటలు వేసిన రైతులను ప్రభుత్వం ఆదుకొని తగిన సహాయం అందించాలని రైతులు కోరుతున్నారు.





# ముఖ్యమంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ రైతుల నిరసన

**ప్రజాపక్షం/చివ్వెంల :** రైతులు తమ రక్తంతో పంటలు పండించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ చివ్వెంల మండలంలోని సేవాలాల్ తండ గ్రామ పంచాయితీ పరిధి పందిబండ తండకు చెందిన రైతులు మంగళవారం తమ రక్తాన్ని తీసి పంట పొలాల్లో చల్లి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ నీళ్లు లేకుండా కేవలం రక్తంతో పంటలు పండించొచ్చని సిఎం అనడం సరైంది కాదన్నారు. ముఖ్యమంత్రికి ఎంత రక్తం కావాలాన్నా ఇస్తామని, పంటలు ఎలా పండించాలో తెలుపాలని డిమాండ్ చేశారు. రైతులు, పంటలపట్ల నిర్లక్ష్యంగా మాట్లాడిన రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, బిఆర్ఎస్ మాజీ సర్పంచ్ గుగులోతు కవి అనిల్ పాల్గొన్నారు.

# పెండింగ్ ఫీజు బకాయిలను విడుదల చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్రంలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ మంగళవారం అన్నారు. ఫీజు బకాయిల కోసం అన్ని విద్యార్థి సంఘాలు, కుల సంఘాలు నిరంతరం ఆందోళనలు, ఉద్యమాలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రం స్పందించకపోవడం అత్యంత బాధాకరమన్నారు. ఫీజు బకాయిలు సకాలంలో విడుదల కాకపోవడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులు కొనసాగించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# రోడ్డు విస్తరణలో ఆస్తి నష్టం వివరాలను తెలపండి




**ప్రజాపక్షం/చిట్యాలః** నల్లగొండ జిల్లా చిట్యాల నుండి భువనగిరి వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణలో భవనాలు, ప్లాట్లు, భూములకు జరిగే నష్టం ఎంతో తెలియజేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ నాయకులు మంగళవారం స్థానిక మున్సిపల్ చైర్మన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. రోడ్డు విస్తరణ ఎన్ని ఫీట్లు ఉండనుందో ఇప్పటి వరకు ప్రజలకు సరైన సమాచారం లేదన్నారు. భవన యజమానులు, వ్యాపారస్థులు, భూ యజమానులు తమకు ఎంత మేరకు ఆస్థి నష్టం జరుగుతుందోనన్న ఆందోళనలో ఉన్నారన్నారు. రోడ్డు విస్తరణ పట్ల కచ్చితమైన సమాచారాన్ని ప్రజలకు వెంటనే తెలియజేయాలని వారు డిమాండ్ చేశారు. వినతి పత్రాన్ని అందజేసిన వారిలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి, కౌన్సిలర్లు నిమ్మనగోటి శ్రీనివాస్, షేక్ సమానాఅజీముద్దీన్, నాయకులు జిట్ట బొందయ్య, బొబ్బల శివశంకర్‌రెడ్డి, కందాటి రమేష్, రుద్రారపు కృష్ణ, ఆగు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత ఆటో డ్రైవర్లపై ఉందన్నారు. ఆటో నడిపే ప్రతి డ్రైవరు తప్పనిసరిగా ప్రభుత్వ గుర్తింపు పొందిన, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలను కలిగి ఉండాలన్నారు. మద్యం మత్తులో వాహనాలు చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. జంక్షన్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పక పాటించాలని, సిగ్నల్ జంపింగ్ చేయవద్దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆటో డ్రైవర్లు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# కల్యాణలక్ష్మి పథకంపై సంతకం పెట్టని గెజిటెడ్ అధికారులు




**ప్రజాపక్షం/మోతె :** కళ్యాణ లక్ష్మి పథకంపై సంతకం పెట్టమని గెజిటెడ్ అధికారులు బోర్డు పెట్టుకున్న విచిత్ర పరిస్థితి మండలంలో నెలకొంది. మండలంలో తహశీల్దార్, ఎంపిడిఓ, ఎంపిఓ, డిప్యూటి తహశీల్దార్, ఎంఇఓ, మండల అగ్రికల్చర్ అధికారి, మండల వైద్యాధికారి, వెటర్నరీ అధికారుతోపాటు 6 గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కలుపుకొని సుమారు 14 మంది ప్రభుత్వ గెజిటెడ్ అధికారులు ఉన్నారు. మండలంలో సుమారు 29 గ్రామాలు, 10 అవాస గ్రామాలు ఉన్నాయి. ప్రతి గ్రామంలో ప్రతి సంవత్సరం కనీసం 5 నుంచి 10 మందికి పెండ్లిలు జరుగుతున్నాయి. కానీ దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని తీరుగా మండలంలో ఎక్కడాలేని విచ్రిత పరిస్థితి ఉంది. ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా రేషన్ కార్డు ఉన్న ప్రతి పేదింటి ఆడబిడ్డకు 18 సంవత్సరాలపై బడిన ఆడ బిడ్డకు పెళ్లి చేసి పుట్టింటి వారు కొంత ఉపశమనం కలుగుతుందని భావించిన తల్లిదండ్రులకు గెజిటెడ్ అధికారుల సంతకంతో పెద్ద ముప్పు వచ్చి పడ్డట్లు అయింది. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా ఏ అధికారి సంతకం పెట్టకపోవడంతో చేసేది లేక వెనుతిరుగుతున్నామని ఆడబిడ్డల తల్లిదండ్రులు వాపోతున్నారు. గెజిటెడ్ అధికారులు సంతకాలు పెట్టకపోవడంతో నెలల తరబడి ఫైల్స్ పెండింగ్‌లో ఉండడంతోపాటు ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలో జాప్యం జరుగుతుంది. ఏదిఏమైనా నిబంధనలను సడలించడం లేదా ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఏదో ఒక శాఖ అధికారికి బాధ్యతలు అప్పగించాలని ఆడబిడ్డల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ‘సర్’ ప్రక్రియ వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని సూర్యాపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ హరి సింగ్ నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులకు, జిపిఓలకు, రెవెన్యూ సిబ్బందికి సర్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించారు. మండల పరిధిలోని 46 పోలింగ్ కేంద్రాల్లో బిఎల్ఓలు ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహిస్తున్నారా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫారాల పంపిణీ, స్వీకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని అన్నారం గ్రామంలో స్థానిక సర్పంచ్ కుంచాల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పంచాయితీ కార్యాలయంలో నిర్వహిస్తున్న సర్వేలో పాల్గొని బిఎల్ఓలు అడిగిన పలు సమస్యల గురించి చర్చించి, బిఎల్ఓలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దయానందం, ఎంపిడిఓ చలపతి, డిప్యూటి తహశీల్దార్ కండ్లమయ్య గౌడ్, ఎంపిఓ సందీప్ కుమార్, జిపిఓ సంజీవ, మండలంలోని 13 మంది పంచాయితీ కార్యదర్శులు, బిఎల్ఓలు పాల్గొన్నారు.

# 16న ‘సర్’ పై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** స్పెషల్ ఎంటెన్సివ్ రివిజన్ సర్ పైన ఉన్న అనుమానాలు అపోహలు నివృత్తి చేయడం కోసం ఈ నెల 16న స్థానిక మిర్యాలగూడలోని గ్రంథాలయంలో ఉదయం 10గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రెసివ్ ఫోరం, జన విజ్ఞాన వేదిక, మరో గ్రంథాల ఉద్యమం నాయకులు డాక్టర్ రాజు, డాక్టర్ ముమ్వా రామారావు, కస్తూరి ప్రభాకర్, కందుకూరి సుదర్శన్‌లు తెలిపారు. మంగళవారం పట్టణంలోని గ్రంథాలయం వద్ద సెమినార్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కస్తూరి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సర్ ఓటర్ ఫారాలు నింపడం పైన ప్రజల్లో అనేక అనుమానాలు నెలకొన్నాయని వాటికి సంబంధించిన అనేక అంశాలను నివృత్తి చేయడం కోసం తెలంగాణ గ్రంధాలయ చైర్మన్ మహమ్మద్ రియాజ్, సామాజిక విశ్లేషకులు విద్యావేత్త రమేష్ పట్నాయక్‌లతో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శ్యాంసుందర్, సహాయ అధికారి సుధాకర్, జేవివి నాయకులు కొండల్ రెడ్డి, సిహెచ్. రమేష్, సునీల్, క్రాంతి, లవన్, సందీప్, రాంబాబు, వెంకటేష్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రభుత్వం పిఆర్‌సిని ప్రకటించి, డిఏలు, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని తపస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పర్వతం సంధ్యారాణి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు యామా రమేష్ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో ఆమె పాల్గొని మాట్లాడారు. గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం చేయకతప్పని పరిస్థితి ఉందన్నారు. పిఆర్‌సి రిపోర్టును వెంటనే తెప్పించుకుని, 51శాతం ఫిట్మెంట్ ప్రకటించాలన్నారు. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం, పిఆర్‌సి, 6 డిఏలు, పెండింగ్ బిల్స్ పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో చొరవ చూపకపోతే ఆగష్టు 1న రాష్ట్ర మహాధర్నా చేపడుతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జూలకంటి వెంకట్‌రెడ్డి, లింగంపల్లి హరిప్రసాద్, సుందరి శ్రీనివాసరావు, తాటికొండ రవీందర్ రెడ్డి, రామారావు, లింగయ్య, తిరుమలేష్, జితేందర్ రెడ్డి, పూల్‌సింగ్, రవి కుమార్ పాల్గొన్నారు.



# నల్లగొండ ఎస్ఇగా అమరబోయిన శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నల్లగొండ జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా అమరబోయిన శ్రీనివాస్ అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విద్యుత్ బీసీ సంఘం రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయి ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. బీసీ సంఘం రాష్ట్ర నాయకులు మారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన ఎస్ఈ అమరబోయిన శ్రీనివాస్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఈ అమరబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది తమ విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా రైతులకు, సామాన్య వినియోగదారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యుత్ బీసీ సంఘం అధ్యక్షుడు గంజి వెంకన్న, కార్యదర్శి ఊటుకూరి గిరి, లైజాన్ ఆఫీసర్ మధు, ఏఏఓ కె.బిక్షపతి, జేఏవో వి.రవికుమార్, ఏడీఈ శంకరయ్య పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్‌తో షాపు దగ్ధం... రూ.20 లక్షల ఆస్తినష్టం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక వ్యాపార దుకాణం పూర్తిగా అగ్నికి ఆహుతైన ఘటన మిర్యాలగూడ మండలం తడకమళ్ళ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు మరియు షాపు యజమాని తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి తడకమళ్ళలోని ‘ఎం ఎన్ ఎస్ ఎంటర్‌ప్రైజెస్’ షాపులో ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో దుకాణంలో నిల్వ ఉంచిన విలువైన ఎల్ఈడీ స్క్రీన్స్, దుస్తులు , ఇతర సామాగ్రి పూర్తిగా తగులబడిపోయాయి.మంటలను గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఫైర్ ఇంజన్‌తో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు 20 లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగినట్లు షాపు యజమాని మారంచెట్టి నరసింహస్వామి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

# రోడ్డు భద్రత మన అందరి బాధ్యత




**ప్రజాపక్షం/మోతె :** రోడ్డు భద్రత మన అందరి బాధ్యతని ఎస్ఐ బి. లచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జాతీయ రోడ్డు భద్రతపై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహావీర్ పేరుతో రోడ్డు ప్రమాదాల బారిన పడ్డ వారిని గంటలోపులో ప్రమాదం స్థలం నుంచి అందుబాటులో ఉన్న దావఖానాకు తరలించి ప్రాణాలు కాపాడిన వ్యక్తి తన వివరాలు పోలీసు వారికి అందించాలని చెప్పారు. మొదటి సారి సుమారు రూ.25వేలు ఇచ్చి మహావీర్ అవార్డుతో సత్కారం చేయడం జరుగుతుందన్నారు. అదే వ్యక్తి రెండవ సారి ప్రమాదంలో గాయపడిన మరో వ్యక్తిని కాపాడితే రూ.50వేలు అందించడం జరుగుతుందన్నారు. మూడవసారి కూడా రోడ్డు ప్రమాదం నుంచి ఏ వ్యక్తిని కాపాడిన రూ.1లక్ష అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు లింగరాజు, వెంకట్‌నారాయణ, వీరబాబు, తరుణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.పరిశీలించారు.

# సర్ వేగవంతం చేయాలి

**ప్రజాపక్షం/మోతె :** ఓటర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి అన్నా రు. మంగళవారం మండల కేంద్రంలో సర్ ఓటర్ నమోదును ఆయన పరిశీలించి మాట్లాడారు. కేంద్ర ఎన్నికల కమీషన్ అమలు చేస్తున్న సర్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఒక్కరికి ఒకే చోట ఒకే ఓటు ఉండాలని చేస్తున్న ప్రక్రియ అన్నారు. 24లోపు ప్రతి ఒక్కరు పూర్తి సమాచారం అందించి ఆన్‌లైన్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలుగు వీరన్న, ఆంజనేయులు పాల్గొన్నారు.




## ఎన్‌హెచ్ఏఐలో ఉద్యోగం సాధించడం అభినందనీయం

ప్రజాపక్షం/చివ్వెంల : అండె వసంత్ నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియాలో డిప్యూటీ మేనేజర్‌గా ఉద్యోగం సాధించడం అభినందనీయమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. మండల కాంగ్రెస్ నాయకులు పత్తిపాక వేణుధర్ మేనల్లుడు, బొత్తలపాలెం గ్రామానికి చెందిన అండె లక్ష్మి నారాయణ జ్యోతి దంపతుల కుమారుడు అండె వసంత్ ఎన్‌హెచ్ఏఐలో ఉద్యోగం పొందారు. మంగళవారం ఏఐసిసి సభ్యులు సర్వోత్తమ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలువగా వసంత్‌ను అభినందించి, మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## బహిరంగ క్షమాపణ చెప్పాలి

ప్రజాపక్షం/నాంపల్లి : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలుగా నియమితులైన యాదవుల పెద్దమ్మ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌పై అవమానకరమైన,అనుచిత వ్యాఖ్యలు చేసిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి తక్షణమే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని నాంపల్లి మండల గొల్లకురుమ ఆత్మీయ సమ్మేళనం కో కన్వీనర్ అబ్బనబోయిన చందు యాదవ్ డిమాండ్ చేశారు.యాదవ సమాజ గౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని దెబ్బతీసే ఇలాంటి వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు.

## అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు

ప్రజాపక్షం/నకిరేకల్ :పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ చేపట్టిన చలో సచివాలయం కార్యక్రమానికి వెళ్తుండగా నకిరేకల్ నియోజకవర్గంలో ఎస్ఎఫ్ఐ,డీవైఎఫ్ఐ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ చర్యను నాయకులు తీవ్రంగా ఖండించారు.అరెస్టైన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దపాటి సుధాకర్, నకిరేకల్ డివిజన్ కార్యదర్శి ముసుగు రవీందర్, డీవైఎఫ్ఐ నాయకుడు పొన్న సురేష్ తదితరులు ఉన్నారు. ప్రజాస్వామ్య ఉద్యమాలను అరెస్టులతో అణచివేయలేరని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

## గ్రామపంచాయతీలకు విద్యుత్ బిల్లులను రద్దు చేయాలి

ప్రజాపక్షం/మోటకొండూర్ : గ్రామపంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న సందర్భంగా గ్రామ పంచాయతీలు చెల్లించే విద్యుత్ బకాయిలు, బిల్లులను రద్దు చేయాలని కోరుతూ యాదాద్రి భువనగిరి జిల్లా సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కొప్పుల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు జన్నే సిద్ధులు, తాండ్ర నారాయణస్వామి, వివిద మండలాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



## చెత్త సేకరణ 'ఈవీ' వాహనాలు ప్రారంభం

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : పురపాలక పరిధిలోని గృహ వ్యర్థాలను సేకరించేందుకు రెండు ఈవి వివాహనాలను మంగళవారం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. 15వ ఆర్థిక నిధులు రూ.34లక్షలతో 2 స్వచ్ఛ ఎలెక్ట్రిక్ ఆటోలను కొనుగోలు చేశారు. అనంతరం 'క్యాచ్ ద రైన్ ప్రచారం' యొక్క ప్రతిజ్ఞ చేసి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో హెచ్ఎండిఏ నగరాభివృద్ధి నిధులతో మంజూరైన పనుల పురోగతిపై సమీక్షించి, నగరాభివృద్ధి నిధులతో టెండర్ పూర్తయిన సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను త్వరితగతిన ప్రారంభించాలని టెండర్ లో పాల్గొనని



పనులకు సంబంధించి మరొకసారి టెండర్లు ఆహ్వానించాలని ఆదేశించడం ఆదేశించారు. వార్డుల వారిగా అవసరమైన ప్రతి చోట విద్యుత్ సౌకర్యము అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ డి.అంజన్ రెడ్డి, వైస్ చైర్ పర్సన్ కొయ్యడ రజిని, కౌన్సిలర్లు కొండమడుగు ఎల్లస్వామి పాల్గొన్నారు.

## పిఆర్‌సి ప్రకటించి డిఏల పెండింగ్ బిల్లులను చెల్లించాలి




ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ : విద్యారంగ,ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించి పిఆర్సి,ఆరు డీఏల పెండింగ్ బిల్స్ పూర్తిగా చెల్లించాలని తపస్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు బత్తిని భాస్కర్ గౌడ్, రేణికుంట్ల రాజశేఖర్ డిమాండ్ చేశారు.పిఆర్సి ప్రకటించి డిఏలు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ తపస్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి అనంతరం జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు సమస్యల న్యాయ పరమైన సమస్యలు పరిష్కారం కోసం ఉద్యమం చేయక తప్పని పరిస్థితి ఉందని న్నారు. రిపోర్టు వెంటనే తెప్పించుకుని,51శాతం ఫిట్మెంట్ ప్రకటన చేయాల.ఉద్యోగ, ఉపాధ్యాయ,పెన్షనర్ల కు సంబందించి ఈ కుబేర్లో పేరుకు పోయిన పెన్షనర్స్ తో సహా అందరికి పెండింగ్ బిల్లులను పూర్తిగా చెల్లించాలని కోరారు.ఈ ధర్నా కార్యక్రమంలో తపస్‌రాష్ట్ర బాధ్యులు ఇరుగు శ్రీరామ్,విజయ్ కుమార్,భాస్కర్ రెడ్డి,పెన్షనర్ల సంఘం రాష్ట్ర,జిల్లా బాధ్యులు బిక్షపతి,గణేష్,రామకృష్ణ రెడ్డి,నూనెముంతల లక్ష్మీనారాయణ,దందేపల్లి లక్ష్మి నారాయణ,కొన్నె శంకర్ గౌడ్,వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ హాస్టళ్లపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

ప్రజాపక్షం/నకిరేకల్ :ఉన్నత విద్య కోసం సంక్షేమ హాస్టళ్లలో చేరిన ఎస్సి విద్యార్థులు కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి సమస్యలను పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు.నకిరేకల్ పట్టణంలోని ఎస్సి సంక్షేమ హాస్టళ్లలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా సర్వేలో ఆయన మాట్లాడారు.విద్యా సంవత్సరం ప్రారంభమై రోజులు గడిచినా ఇప్పటికీ నోట్ పుస్తకాలు,స్టేషనరీ పంపిణీ చేయలేదని, గత పదేళ్లుగా ప్లేట్లు,గ్లాసులు కూడా ఇవ్వకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.జిల్లాలోని అనేక హాస్టళ్లలో తాగునీటి సమస్య,పనిచేయని ఫిల్టర్ ప్లాంట్లు, ఇన్వర్టర్లు, మరు



గుదొడ్లు, స్నానాల గదులు, ఫ్యాన్లు, భవనాల మరమ్మతులు, పరిశుభ్రత వంటి కనీస వసతులు కూడా లేవని ఆందోళన వ్యక్తంచేశారు.ఈకార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి వంటిపాక కృష్ణ, విద్యార్థులు,సంఘం నాయకులు పాల్గొన్నారు.

## అంజన్న మృతి గ్రామ శాఖకు తీరని లోటు



ప్రజాపక్షం/నాంపల్లి : మండలంలోని పెద్దాపురం గ్రామంలో సిపిఐ గ్రామ శాఖ మాజీ కార్యదర్శి కోరే అంజన్న అనారోగ్యంతో మృతి చెందారు.వారి పార్థివ దేహానికి మండల సిపిఐ కార్యదర్శి సుదనబోయిన రమేష్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంజన్న మరణం పెద్దాపురం సిపిఐ గ్రామ శాఖకు తీరని లోటని పేర్కొన్నారు.అంజన్న సిపిఐ పిలుపుమేరకు ఎన్నో పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్న వ్యక్తి అని, అంజన్న అంతిమయాత్రలో పాల్గొనడం బాధాకరమని తెలిపారు.అంజన్న ఆశయాలను ముందుకు తీసుకువెళ్తామని, వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈకార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి నేతళ్ల రాజు,ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బి. జగన్,యాద్రి జిల్లా ప్రజానాట్యమండలి వర్కింగ్ ప్రెసిడెంట్ కలకొండ సంజీవ, మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ గిరి రమ,మండల కార్యవర్గ సభ్యులు ఊరుపాక వెంకటయ్య,కోరే సత్తయ్య,పల్లె సైదులు,నేరెళ్ల సైదులు, పల్లె గోపాల్ రెడ్డి,గిరి స్వామి,కానుగుల మహేష్, ఋషిపాక యాదయ్య పాల్గొన్నారు.

## ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణ

ప్రజాపక్షం/రామన్నపేట: రామన్నపేట మండలంలోని హరిజనవాడ కాలనీలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జమీరుద్దీన్ ఆధ్వర్యంలో కాలనీవాసులు ఎన్నికల ఎన్యుమరేషన్ ఫారాలను నింపి ఎన్నికల శాఖ సీనియర్ అసిస్టెంట్ రమావత్ వినీతాబాయి,బూత్ లెవల్ ఆఫీసర్ మేడి లలితలకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలు తమ ఓటరు వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని, ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొనాలని నాయకులు సూచించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బొడ్డు సాలయ్య, సురేందర్ రావు, గ్రామ పంచాయతీ బిల్ కలెక్టర్ రాములు పాల్గొన్నారు.




## వర్షపు నీటిని ఒడిసిపడితేనే భవిష్యత్తుకు భరోసా

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : వర్షపు నీటిని సంరక్షించడం ద్వారా భూగర్భజలాలను పెంపొందించడంతోపాటు భావితరాలకు నీటి వనరులను భద్రపర్చవచ్చని సూర్యాపేట మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వర్షాన్ని పట్టుకోండి ప్రచార కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట మున్సిపాలిటి ఆధ్వర్యంలో వర్షపునీటి సంరక్షణపై మంగళవారం పట్టణంలో విస్తృత అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఇంటి వద్ద, ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు భవనంలో వర్షపు నీటి సేకరణ గుంతలను ఏర్పాటు చేయడం కాలానుగుణంగా అవసరమన్నారు. వర్షపు నీటిని వృధాగా వదిలేయకుండా భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకుంటే భూగర్భజలాలు పెరిగి, భవిష్యత్తులో తాగునీటి కొరతను అధిగమించవచ్చని తెలిపారు. ఈ ర్యాలీలో వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డిఈ, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, వార్డు అధికారులు పాల్గొన్నారు.

## బిఎల్ఓలు ఇచ్చిన దరఖాస్తులు పూరించాలి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : ఓటు హక్కు ఉన్నవాళ్ళు అందరూ ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో దరఖాస్తు చేసుకోవాలని సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ ఛైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ తెలిపారు.సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ,మహాత్మా గాంధీ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం యూనివర్సిటీ సెమినార్ హాల్ లో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జాబితా సర్‌పై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టిందని చెప్పారు.2002లో చేపట్టిన తరువాత మళ్ళీ ఓటర్ జాబితా సమగ్ర సవరణ ఇప్పుడు నిర్వహిస్తున్నార నీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటరమణారెడ్డి,డాక్టర్ ఎల్ మధు, డా.శ్రీదేవి,డాక్టర్ మచెందర్,పిట్టల శంకర్,కాసుల అజయ్ కుమార్,భోనగిరి సంతోష్ కుమార్,కరింగు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాపక్షం/నాంపల్లి : నాంపల్లి మండలంలోని మల్లపురాజుపల్లి గ్రామానికి చెందిన చెన్నోజు భీష్మాచారి అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. వైద్య ఖర్చులు అధికంగా కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న ఆయన కొత్తగూడెం ఎమ్మెల్యే,సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కోసం దరఖాస్తు చేసుకున్నారు.దరఖాస్తును పరిశీలించిన ప్రభుత్వం బాధితుడికి రూ.35 వేల సీఎం సహాయనిధి మంజూరు చేసింది.ఈ మేరకు మంజూరైన చెక్కును సిపిఐ మల్లపురాజుపల్లి గ్రామ శాఖ కార్యదర్శి పల్లేటి దశరథ శనివారం చెన్నోజు భీష్మాచారికి అందజేశారు.ఈ కార్యక్రమంలోగ్రామ శాఖ సహాయ కార్యదర్శి వెంకటాచారి,వార్డు సభ్యురాలు పల్లేటి శోభారాణి,గొడ్డటి ముత్యాలు, చెన్నోజు గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.



## సర్ ప్రక్రియను వేగం పెంచాలి

**ప్రజాపక్షం/నడిగూడెం:** ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎంపిడివో మల్సూర్‌నాయక్ మంగళవారం మండలంలోని రామాపురం గ్రామాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్ పై తగు సూచనలు, సలహాలు ఇచ్చి వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. సర్ ఫార్‌ను జాగ్రత్తగా పూరించాలని లేనిచో ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. బిఎల్‌వోలు పాల్గొన్నారు.

## కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల స్టూడెంట్ డైరీ



**ప్రజాపక్షం/కోదాడ:** కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యా ప్రగతి పర్యవేక్షణకు ప్రభుత్వ పాఠశాలలో స్టూడెంట్ డైరీ విధానం అమలు చేయడం అభినందనీయమని కోదాడ మండల విద్యాధికారి సలీంషరీఫ్ అన్నారు. మంగళవారం కోదాడలోని బాలుర ఉన్నత పాఠశాలలో ప్రగతి పర్యవేక్షణకు ఉత్తమ సాధనంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మధ్య స్టూడెంట్ డైరీ వారిధిగా ఉంటుందని, రోజువారి పాఠశాల దినచర్యలను పాఠ్యాంశాలు ఇంటి పని, పరీక్షలు, సెలవులు తదితర విషయాలను విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియచేయడం సులభతరం అవుతుందని అన్నారు. పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం మార్కేండేయ, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, లింగయ్య, ఖాజామియా, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## అక్రమంగా సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఎనిమిది లీటర్ల సారాను బైకుపై తరలిస్తున్న వ్యక్తిని హుజూర్‌నగర్ ఎక్సైజ్‌శాఖ పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. సిఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం హుజూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల పాలకవీడు మండలం శూన్యంపహడ్ తండా గ్రామానికి చెందిన రమావత్ రాముడు అను వ్యక్తి తన బజాజ్ పల్సర్ వాహనంపై 8 లీటర్ల సారాను తరలిస్తుండగా ఎక్సైజ్ అధికారి దివ్య ఆధ్వర్యంలో వాహనంను సీజ్ చేసి 8 లీటర్ల సారాను స్వాదీనం చేసుకుని ఆ వ్యక్తిపై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్లు సుధాకర్, పుట్ట శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## బిఎల్‌వో, బిఎల్ఏలకు సూచనలు

**ప్రజాపక్షం/డిండి;** సర్ ప్రక్రియలో భాగంగా డిండి మండల పెద్దతండా గ్రామ పంచాయతీలో డిండి తహాశీల్దార్ హన్మంత్ శ్రీనివాస్‌గౌడ్ పర్యటించి ఓటర్ నమోదు ప్రక్రియను పరిశీలించి బిఎల్‌వో, బిఎల్ఏలకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిండి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యాల శశిధర్‌రెడ్డి, బిఎల్ఏ రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల హక్కుల కోసం పోరాడితే అక్రమ అరెస్టులా?



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** విద్యార్థుల హక్కుల కోసం పోరాడితే అక్రమ అరెస్టులు చేస్తారా అని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చిలకరాజు శ్రీను అన్నారు. మంగళవారం నేరేడుచర్ల పట్టణంలో విద్యార్థి యువజన నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈసందర్భంగా శ్రీను మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్న విద్యార్థి, యువజన నాయకులను ముందస్తు అక్రమ అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అని ఖండించారు. లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయకుండా సమస్యపై ప్రశ్నించిన వారినే లక్ష్యంగా చేసుకుని అక్రమ అరెస్టులు చేయడం సరికాదన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను అణిచివేస్తే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్యమబద్ధంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పరికె భరత్, వడ్డాల భాస్కర్, మాతంగి విజయ్, ఉబ్బవల్లి సైదులు, సయ్యద్ హుస్సేన్ పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తెలంగాణ రాష్ట్రంలోని రెండున్నర లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికులను పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టిఎస్ సిపిఎస్‌ఈయు రాష్ట్ర అధ్యక్షులు గంగారపు సీతప్రజ్ఞ అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ చేరిన జనజాగరణ యాత్ర ర్యాలీలో భారీ ఎత్తున ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జీవితకాలం ప్రభుత్వ సేవ చేసిన ఉద్యోగులకు వృద్దాప్యపు భద్రత కోసం పెన్షన్ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని 2004 సెప్టెంబర్ ఒకటోతేదీ నుంచి అమలు చేస్తున్న పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉద్యోగ ఉపాధ్యాయుల ర్యాలీగా వెళ్లి మంత్రివర్యులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎస్ ఈయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి మల్లిఖార్జున్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రకాంత్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఓరుగంటి నాగేశ్వరరావు, బడుగుల సైదులు, పాలూరి అంజయ్య, మణి, కెవి సత్యనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, వల్లపుదాసు మైసయ్య, సాయిలు, రాంబాబు, కస్తాల నారాయణ, అశోక్, శ్రీను, జనార్ధన్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సింహరావు, సీతరాములు, కమలమ్మ, శ్రీదేవి, విజయ పాల్గొన్నారు.

## సిఐటియు రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/తుర్కపల్లి:** పోరాటాల గడ్డ భువనగిరి పట్టణంలో,వచ్చేనెల ఆగస్టు 16, 17, 18 తేదీలలో నిర్వహించనున్న సిఐటియు రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం తుర్కపల్లి మండలంలో మాదాపూర్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం, సిఐటియు రాష్ట్ర కమిటీ సమావేశాల కరపత్రాన్ని సిఐటియు మండల కన్వీనర్ తూటి వెంకటేశంతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనగిరిలో మూడు రోజుల పాటు జరుగుతున్న ఈ రాష్ట్ర కమిటీ సమావేశాలలో ఆలిండియా, రాష్ట్ర నాయకత్వంతో పాటు అన్ని జిల్లాల ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సమగ్రంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ తూటి వెంకటేశం, స్థానిక భవన నిర్మాణ యూనియన్ అధ్యక్షులు పాముల రవి, మాజీ అధ్యక్షులు పాముల మల్లేష్, ఉపాధ్యక్షులు సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** అర్హులైన జర్నలిస్టులందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇంటి స్థలాలు కేటాయించాలని గరిడేపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొండా సైదులుగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజల మధ్య వారదిగా నిలుస్తూ ఎలాంటి జీతభత్యాలు లేకుండా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకవస్తూ ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న విలేకరులకు ప్రభుత్వాలు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇస్తామని హామీలు ఇచ్చినా ఇప్పటి వరకు అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లు కేటాయించి వారికి న్యాయం చేయాలనికోరారు. ప్రభుత్వాలు మారుతున్న విలేకరుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధచూపే పరిస్థితి కనిపించడంలేదని అన్నారు. ఈ విషయమై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ముచ్చర్ల గోపాలకృష్ణ, మేకపోతుల వెంకటేశ్వర్లు, తాటికొండ లక్ష్మణ్, కుక్కడపు గురవయ్య, వల్లపుదాసు జోష్‌గౌడ్, చాగంటి వీరయ్య, కడారి వెంకటేశ్వర్లు, కొలిపాక జగదీష్, మేకపోతుల శేఖర్, సంద్ర శివ, కుర్ర గోపి పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారాలకు ధర్నా

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ప్రజా సమస్యల పరిష్కారాలకై ధర్నాలు రాస్తారోకోలు చేయాలని బిజెపి మండల బిజెపి పార్టీ పిలుపునిచ్చింది. పోచంపల్లిలో మంగళవారం పట్టణ బిజెపి కార్యవర్గ సమావేశాలు నిర్వహించారు. పట్టణ అధ్యక్షులు డబ్బికారు సాహెష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు ఉట్కూరు అశోక్ గౌడ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పట్టణంలోని అనేక సమస్యలపై బూత్ అధ్యక్షులతో చర్చించారు. నీటి సమస్య వీధిలైట్ల సమస్య డ్రైనేజీ వంటి పలు సమస్యలపై ధర్నా కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. సంస్థాగతంగా పార్టీ బలోపేతం చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ చిక్కా కృష్ణ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్ ఒకటో వార్డు కౌన్సిలర్ శ్రీరామ్ మంజుల లింగస్వామి యాదవ్, చేనేత సెల్ జిల్లా కన్వీనర్ గంజి బసవలింగం, ఎస్సీ మోర్చా అధ్యక్షులు చెరుకు వెంకటేశం, మాజీ సర్పంచ్ నోముల గణేష్, కిసాన్ మోర్చా అధికార ప్రతినిధి రంగారెడ్డి పాల్గొన్నారు.

## పిహెచ్‌సిలో గ్రామ పంచాయతీ కార్యదర్శికి సాధారణ ప్రసవం



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ప్రభుత్వ వైద్య సేవల నాణ్యతకు నిదర్శనంగా నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మరో విజయవంతమైన సాధారణ ప్రసవం జరిగింది. కొమటికుంట గ్రామ కార్యదర్శి ఎం.నాగలక్ష్మి కివైద్యులు సాధారణ ప్రసవం చేశారు. మూడు కిలోల బరువున్న ఆరోగ్యవంతమైన పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగిని మాట్లాడుతూ తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన ప్రసూతి సేవలు, అనుభవజ్ఞులైన వైద్య బృందం ఆధునిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి గర్భిణీ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం చేయించుకుని ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిపై విశ్వాసంతో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు సైతం ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవడం ప్రజలకు ఆదర్శనంగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్‌నర్సులు ఉదయశ్రీ, అంజలి, విజయసుశీల, ఆశా కార్యకర్త స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

## నీటిని ఆదా చేద్దాం... భావి తరాలకు భద్రత కల్పిద్దాం

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** నీటిని ఆదా చేసి భావితరాలకు భద్రత కల్పిద్దామని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. జల్ సంచయ్ జన భాగీదారి కార్యక్రమంలో బాగంగా మంగళవారం నేరేడుచర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించి జల ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా క మిషనర్ మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా భూగర్భజల నీటిమట్టం పెరుగుటకు, భవిష్యత్ తరాలకు తగిన నీటి భద్రత కల్పించుటకు, పర్యావరణ పరిరక్షణకు మనమందరం తోడ్పడవచ్చన్నారు. మున్సిపాలిటి పరిధిలోని ప్రజలందరూ వర్షపునీటి సంరక్షణ చర్యలు చేపట్టి, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి నీటి వృధాను నివారించాలన్నారు. ప్రతిపౌరుడు బాధ్యతతో వ్యవహరించి నీటి సంరక్షణలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## బోయపల్లి కుటుంబాన్ని పరామర్శించిన సర్వోత్తమ్ రెడ్డి

**ప్రజాపక్షం/చివ్వెంల :** మండలంలోని ఐలాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బోయపల్లి వెంకటేశ్వర్లు ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు సేవలను స్మరించుకొని, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ధరావత్ వీరన్న నాయక్, నాయకులు చింత మళ్ళ రమేష్, సామ బాల్‌రెడ్డి, వెంకటరమణ, రమేష్, పూర్ణచంద్ర రెడ్డి, ఉప్పలయ్య, ఉపేందర్, పుల్లయ్య, గురువయ్య, లింగయ్య పాల్గొన్నారు.

## రక్షణ గోడలు నిర్మించాలి



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** తుంగతుర్తి నుండి గానుగుబండ, తూర్పుగూడెం రోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డు పక్కన బావులకు తక్షణమే రక్షణ గోడలు నిర్మించాలని బిఆర్ఎస్ నాయకులు గుండగాని దుర్గయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గానుగుబండ నుంచి తూర్పుగూడెం వెళ్లే ప్రధాన రహదారిలో బావి పక్కనే రహదారి ఉండడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. అత్యవసరంగా ఆర్ అండ్ బి శాఖ అధికారులు స్పందించి మాతంగి వాణి బావి వద్ద, ముత్తయ్య బావి ప్రాంతంలో కూడా రహదారి పక్కన రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాలు జరగకుండా నివారించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కుశలవరెడ్డి, వీరయ్య, కరుణాకర్, పోలెపాక సతీష్, పరుశురాములు, రవి పాల్గొన్నారు.

## ఈశ్వరమ్మ యాదవ్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** యాదాద్రి టెంపుల్ ట్రస్ట్ మెంబర్, మాజీ కార్పొరేటర్ పోచనబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌పై యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా చెప్పుకుంటున్న జక్కిడి శివచరణ్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల మిర్యాలగూడ పట్టణ యాదవ సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక యాదవ సంఘ భవనంలో నిర్వహించిన సమావేశంలో పట్టణ యాదవ సంఘం అధ్యక్షులు కట్టెబోయిన శ్రీనివాస్‌యాదవ్, సీనియర్ నాయకులు సర్నాల వెంకన్నయాదవ్ మాట్లాడారు. ఈ సమావేశంలో పట్టణ 4వ వార్డు కౌన్సిలర్ పుట్టపాక శ్రీనివాస్‌యాదవ్, 28వ వార్డు కౌన్సిలర్ గంగుల బిక్షంయాదవ్, యూత్ గౌరవాధ్యక్షులు జంగా లక్ష్మణ్‌యాదవ్, యూత్ సహ అధ్యక్షులు బచ్చబోయిన మహేష్ యాదవ్, మట్టపల్లి సునీల్ తదితర యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.



# ఎలాంటి పొరపాట్లు జరగకూడదు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను అత్యంత జాగ్రత్తగా చేపట్టి, అర్హులైన ప్రతి ఓటరు వివరాలు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఈఆర్వో, ఆర్డీవో ఎస్.రమణారెడ్డి సూచించారు. మండలంలోని జప్తివీరప్పగూడెం గ్రామంలో పోలింగ్ స్టేషన్ నంబర్153 పరిధిలో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి సేకరిస్తున్న వివరాలు, నమోదు ప్రక్రియ, పత్రాల ధృవీకరణ విధానాన్ని పరిశీలించిన ఆర్డీవో ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని బీఎల్‌ఓలకు సూచించారు. ఓటర్ల వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, అర్హులైన



ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా చూడాలని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి తప్పులు లేని ఓటర్ల జాబితా అవసరమని, అందుకోసం అధికారులు, బీఎల్‌ఓలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎల్ఓ, బీఎల్ఓ సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

## సుస్థిర వ్యవసాయ విధానాలపై సిఆర్‌బి బృందం అధ్యయనం



**ప్రజాపక్షం/నిడమనూరు :** ఆయిల్‌పామ్ సాగులో సుస్థిర వ్యవసాయ విధానాలను అధ్యయనం చేసేందుకు సెంటర్ ఫర్ రెస్పాన్సిబుల్ బిజినెస్ ప్రతినిధుల బృందం మంగళవారం నల్లగొండ జిల్లాలో పర్యటించింది.ఆయిల్‌పామ్ సాగులో రైతులు అనుసరిస్తున్న పద్ధతులు,అంతర పంటల సాగు,నేల సార పరిరక్షణ చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో ముఖాముఖి చర్చించింది.పర్యటనలో భాగంగా నిడమనూరు మండలం వేంపాడు గ్రామానికి చెందిన రైతు పెందుర్తి నరేందర్‌రావు ఆయిల్‌పామ్ తోటను సందర్శించి, మొక్కల ఎదుగుదల, దిగుబడి, ఆదాయం, సాగులో ఎదురవుతున్న సమస్యలపై రైతుతో చర్చించారు.పెద్దవూర మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన రైతు శ్రీనివాస్ సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను సందర్శించారు.ఈ సందర్భంగా సిఆర్‌బి బృందం సభ్యులు మాట్లాడుతూ రసాయన ఎరువులపై పూర్తిగా ఆధారపడకుండా పశువుల ఎరువు, వర్మీ కంపోస్ట్, జీవామృతం వంటి సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌బి బృందం సభ్యులు ప్రసిద్ధ,రజత్,మల్లేశ్వరరావు,ఉద్యాన అధికారులు కె. మురళి,శ్యామ్ సుందర్‌రెడ్డి,పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ మేనేజర్ డాక్టర్ కె.మధుసూదన్‌రెడ్డి,హెచ్‌ఈఓ ఆర్.జనార్ధన్ రెడ్డి, ఆయిల్‌పామ్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు

**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మున్సిపాలిటీలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం తో పాటు మెరుగైన పౌర సేవలు అందించేందుకు చండూరు మున్సిపాలిటీ కట్టుబడి ఉందని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్మన్ కోడి శ్రీనివాసులు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మున్సిపాలిటీ లో ఉన్న పలు సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా చండూరు మున్సిపాలిటీ పరిధిలో చనిపోయిన వారికి నిర్వహించే అంత్యక్రియలకు అయ్యే ఖర్చును పారదర్శకంగా అందరికి ఆమోదయోగ్యంగా నిర్ణయించేందుకు వచ్చే ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించాలని కౌన్సిల్ సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో అన్ని కులాల కుల పెద్దల అభిప్రాయాలు ,సూచనలు స్వీకరించి వాటిని పరిశీలించిన అనంతరం తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. అదే విధంగా ప్రతి రోజు ఉపాధి కోసం వచ్చే కూలీల సౌకర్యార్థం గుండ్రపల్లి చౌరస్తాను ప్రత్యేక లేబర్



అడ్డగా కౌన్సిల్ సమావేశం నిర్ణించనైనదని తెలిపారు. చండూరు మున్సిపాలిటీని ప్రజలకు అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రజలకు మెరుగైన పౌర సేవలను అందించేందుకు మున్సిపాలిటీ కట్టుబడి ఉందని అన్నారు. ఈ సమావేశంలో కమీషనర్ మల్లేశం , వైస్ చైర్మన్ భూత రాజు దశరథ , కౌన్సిల్ సభ్యులు తేలుకుంట్ల రాజకుమారి చంద్రశేఖర్ , బుషిపాక వాసు, సామ సుజాత యాదవరెడ్డి, జెల్ల ధనమ్మశ్రీనివాస్ , కొండ్రెడ్డి మధు, కోడి సుష్మావెంకన్న, కలిమికొండ పారిజాతజనార్ధన్ , కోఆప్షన్ సభ్యులు ఖలీల్ పాల్గొన్నారు.

## మార్కులే కాదు.. మంచి వ్యక్తిత్వానికీ గుర్తింపు

**ప్రజాపక్షం/నందికొండ:** విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ,నాయకత్వ లక్షణాలు,సామాజిక బాధ్యతను ప్రోత్సహించేందుకు పర్వతనేని ఆశ ఫౌండేషన్ ట్రస్ట్ ఈ విద్యాసంవత్సరం నుంచి స్కూల్ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో చదివే విద్యార్థులకు రెండు ప్రత్యేక అవార్డులను ప్రకటించింది. నోబుల్ స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ తో పాటు ది ఛాన్స్ అవార్డు పేర్లతో ఈ రెండు అవార్డులను అందజేయనున్నారు. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా విజేతలైన ఇద్దరు విద్యార్థులకు మెడల్, ట్రోఫీ,ప్రశంసాపత్రంతో పాటు ఒక్కొక్కరికి రూ.30 వేల చొప్పున విద్యా ప్రోత్సాహక నగదును అందజేయనున్నారు. అలాగే వారి పేర్లను పాఠశాల గౌరవ బోర్డుపై శాశ్వతంగా నమోదు చేయనున్నట్లు ట్రస్ట్ వెల్లడించింది.




విద్యార్థుల్లో మంచి వ్యక్తిత్వం,సేవాభావం,నైతిక విలువలు పెంపొందించడంలో ఈ అవార్డులు దోహదపడతాయని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.



## విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రభుత్వం విద్యారంగంలో ఉన్న పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించి, పేద, వెనుకబడిన తరగతుల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని బిసి జెఏసి జిల్లా కన్వీనర్ భద్రబోయిన సైదులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జెఏసి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న పేద, మధ్య తరగతి ప్రజల విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. వెనుకబడిన తరగతుల విద్యార్థులకు రావల్సిన పెండింగ్ ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు, గ్రీన్ చాక్ బోర్డులు మెరుగుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో జెఏసి జిల్లా ఉపాధ్యక్షుడు బైరోజు మదనాచారి, కక్కిరేణి నాగేంద్రబాబు, బూర సందీప్, సాయి యోగేష్ పాల్గొన్నారు.

## చేయూతనివ్వడం అభినందనీయం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో, ప్రతి రంగంలో ప్రతిభ ఉన్న నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయడం అభినందనీయమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వైట్‌హౌస్‌లో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాస శృతి సౌజన్యంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతనకల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని సప్పిడి నందినికి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని ఆయన చేతుల మీదుగా అందించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అక్షర ఫౌండేషన్ చైర్మన్ యాస రాంకుమార్ రెడ్డి, అధ్యక్ష కార్యదర్శులు ఉప్పు నాగయ్య, రుద్రంగి కాళిదాసు, సుభాష్ చంద్రబోస్, బత్తిని ఉపేందర్ పాల్గొన్నారు.

## పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలి




**ప్రజాపక్షం/హాలియా:** పరిశుభ్రత ప్రమాణాలు పాటించినట్లయితేనే పరిసరాలు, ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, కమిషనర్ రవీందర్ రెడ్డి లు అన్నారు. మంగళవారం హాలియా పురపాలక సంఘం కార్యాలయంలో నమస్తే డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర గృహ పట్టణాల వ్యవహారాల మంత్రిత్వ శాఖ, కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నమస్తే డే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. హాలియా మున్సిపాలిటీ పరిధిలో ఇన్ ఫార్మర్ వేస్ట్ పికర్స్ (అనధికార చెత్త సేకరణదారులు) గా గుర్తించిన ఐదుగురికి ఆక్యుపేషనల్ సేఫ్టీ అండ్ హెల్త్ ట్రైనింగ్‌లో శిక్షణ ఇచ్చి వారికి అధికారిక చెత్త సేకరణదారుల గుర్తింపు కార్డులు అందజేశారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు,కరుణాసాగర్,మజహర్,ఎడవల్లి రంజిత్ పాల్గొన్నారు.

## భాగస్వామ్యం కావాలి

**ప్రజాపక్షం/చండూరు:** విద్యార్థులు నీటిని సంరక్షించడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని చండూరు మున్సిపల్ కమీషనర్ మల్లేశం అన్నారు. మంగళవారం చండూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వర్షపు నీటి సంరక్షణ ,భూగర్భ జలాల పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన సదస్సు కల్పించారు. నీటి సంరక్షణపై ఉపన్యాసం ఇచ్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటేశ్వర్ రెడ్డి, మున్సిపల్ మేనేజర్ రాములు , టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అంజయ్య , వార్డు ఆఫీసర్ సాయిరాం , ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ అరవింద్ రెడ్డి , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## అన్న ప్రసాదం వితరణ

**ప్రజాపక్షం/నకిరేకల్ :** వాసవి క్లబ్,వనిత క్లబ్,కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో కోటగిరి శ్రీనివాస్,కోటగిరి రమేష్ మాతృమూర్తి కోటగిరి లక్ష్మమ్మ జ్ఞాపకార్థం మంగళవారం పట్టణంలో అమావాస్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.ఈకార్యక్రమంలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ గజ్జల రామకృష్ణ, రీజియన్ చైర్పర్సన్ గుండా నరేందర్, క్లబ్ అధ్యక్షులు గుండా స్రవంతి,ఉపాధ్యక్షులు కందగట్ల పవన్,ప్రధాన కార్యదర్శి శ్రీకాకుళ వెంకన్న హైమావతి పాల్గొన్నారు.

## గీత పనివారల సంఘం సభ్యత్వ నమోదు

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల పరిధిలోని సుద్దాల, అనంతారం, వెల్మజాల గ్రామాలలో మంగళవారం జిల్లా అధ్యక్షులు చాపల అంజయ్య, సిపిఐ జిల్లా నాయకులు అన్నెపు వెంకట్ ఆధ్వర్యంలో గీతా పనివారల సంఘం శాఖలను ఏర్పాటు చేసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కల్లు గీత సొసైటిలు, టిఎఫ్‌టిలు ఏర్పాటు చేయాలని, జీవో నెం 560 ప్రకారం ప్రతి సొసైటికి ఐదు ఎకరాల భూమిని ఇచ్చి గీతా వృత్తిని ఆధునీకరించి గీతా పరిశ్రమలు నెలకొల్పాలని, ప్రతి జిల్లాలో నీరా కేంద్రాలను ఏర్పాటు చేయాలని, చెట్టు పై నుండి పడి మరణించిన గీతా కార్మికుల కుటుంబానికి ఎక్స్‌గ్రేషియాలు చెల్లించాలని, 50 సంవత్సరాలు పై బడిన గీతా కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

## రామస్వామి మృతి బాధాకరం

**ప్రజాపక్షం/డిండి;** కాంపల్లి రామస్వామి మృతి బాధాకరం అని గోనకోల గ్రామ సర్పంచ్ కొసిరెడ్డి రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం డిండి మండలంలోని గోనకొల్ గ్రామానికి చెందిన కాంపల్లి రామస్వామి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి ఆర్థిక భరోసాగా గోనకోల్ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి రూ. 5వేలు ఆర్థిక సహాయం అందించారు. కుటుంబానికి భరోసాగా రూ. 5వేలు ఆర్థిక సాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ముమ్ముందు గ్రామ పంచాయతీలో ఎవరికి ఏ ఆపద వచ్చినా తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో కాంపల్లి సురేష్, వినయ్, శ్రీకాంత్, దేవ సహాయం, నిరంజన్, శేఖర్, శైలేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఇని కలిసిన విద్యుత్ బిసి నాయకులు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** విద్యుత్ శాఖ నల్లగొండ సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా బాధ్యతలు స్వీకరించిన అమరబోయిన శ్రీనివాస్ ను విద్యుత్ బిసి సంఘ నాయకులు మంగళవారం ఎస్ఈ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా విద్యుత్ బిసి రాష్ట్ర నాయకులు మారం శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగులు,సిబ్బంది రైతులకు,వినియోగదారులకు అందుబాటులో ఉంటు విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసీ విద్యుత్ అంతరాయాలను తగ్గించాలని అన్నారు.అదేవిధంగా ప్రజలకు, పశువులకు విద్యుత్ శాఖ కార్మికులకు ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యుత్ బిసి సంఘ అధ్యక్షుడు గంజి వెంకన్న,కార్యదర్శి ఊటుకూరి గిరి,లైజాన్ ఆఫీసర్ మధు,ఏఏఓ కె బిక్షపతి,జేఏవో వి.రవికుమార్,ఏడిఈ శంకరయ్య,. హరి ప్రసాద్,జి శ్రీనివాస్,ఏఈ ఎస్ హరికృష్ణ పాల్గొన్నారు.

# యూరియా బస్తాపై రవాణా చార్జీలు రైతులే భరించాలి

**ప్రజాపక్షం/చింతలపాలెం :** తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జిఓ ప్రకారం ఎరువుల రవాణాకు సంబంధించి ఇప్పటి వరకు అమలులో ఉన్న ఎఫ్ఓఎల్ సౌకర్యాన్ని రద్దు చేసిన నేపథ్యంలో యూరియా బస్తాపై రవాణా చార్జీలు ఇక రైతులే భరించాలని చింతలపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఏసిఎస్) సిఈఓ యలమంద కోరారు. ఇప్పటి వరకు ఎరువుల లారీల లోడింగ్, రవాణా, అన్‌లోడింగ్ తదితర ఖర్చులను ప్రభుత్వం భరించేదని, అయితే తాజా ప్రభుత్వ ఉత్తర్వులతో ఆ ఎఫ్ఓఎల్ సౌకర్యం నిలిపివేయడంతో ఇకపై ఆయా రవాణా వ్యయాలను ప్రతి యూరియా బస్తా ధరకు అదనంగా కలపాల్సి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో భాగంగా ఎరువుల విక్రయ కేంద్రంలో స్టాక్ అయిపోతే రైతులకు వెయిటింగ్ లిస్ట్ సౌకర్యం కల్పించడం, తదుపరి స్టాక్ వచ్చే తేదీ, సమయాన్ని ఫర్టిలైజర్ యాప్ ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు. అలాగే మూడు ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు అర్హత మేర మొత్తం ఎరువులను ఒకేసారి అం దించే విధానం అమల్లోకి తీసుకువచ్చినట్లు వివరించారు. రైతులు ఈ మార్పులను గమనించి, ఎరువుల గొనుగోలు సమయంలో కొత్త విధానాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులకు సహకరించాలని కోరారు.

## ప్రమాదకరంగా విద్యుత్ తీగలు




**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మండల కేంద్రలోని మాదారం వెళ్లే ప్రధాన రహదారిపై ముఖ్యంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌కి కూతవేటు దూరంలో కిందకు వేలాడుతున్నా వైర్లు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ ప్రమాదకర పరిస్థితి వల్ల నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాలు బారీన పడే తీవ్ర అస్కారం ఉంది. ఇటువంటి సున్నితమైన సమస్యను స్థానిక అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది గమనించకపోవడం వారి నిర్లక్ష్యానికి అర్థం పడుతుంది. నిత్యం అనునిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ మార్గం ప్రమాదాలకు కేంద్ర బింధువుగా మారే ప్రమాదం పొంచి ఉందని ఎటువంటి ప్రమాదాలు జరగకముందే తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**కరెంట్ వాళ్లకు చెప్పిన సరే పట్టించుకోవడంలేదు: పిఎల్‌వి లక్ష్మ య్య**

మేళ్లచెరువు నుంచి మాదారం, రఘునాధపాలెంకి వెళ్లే ప్రధాన రహదారిపై విద్యుత్ తీగలు కిందకు (తక్కువ ఎత్తులో) వేలాడుతూ ఉన్నాయని, వాటి కింద నుంచి వెళ్లే వాహనాలకు ప్రమాదకరంగా ఉంటుందని, వర్షకాలంలో వీచే గాలులకు రెండు వైర్లు కలుసుకుని మంటలు వచ్చే ప్రమాదం ఉందని, మంటలు ఇండ్లమీద పడుతున్నాయని, మనుషుల మీద పడితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## కళాకారుడు పాడే మోసిన ఆ నలుగురు



**ప్రజాపక్షం/చివ్వెంల :** ఎక్కడో ఒంటరిగా కర్నూలు (రాయలసీమ) ప్రాంతం నుండి 1975 ప్రాంతంలో పౌరాణిక రంగస్థలం నటనపై ఆసక్తితో సూర్యాపేటకు వచ్చి హోటల్‌లో పనిచేస్తూ స్థిరపడిన కళాకారుడు జి. సుబ్బారావు గత పది సంవత్సరాలుగా చివ్వెంల మండలంలోని బీబీగూడెంలో గ్రామస్తుల సహకారంతో ఒంటరిగా నివసిస్తూ మంగళవారం మృతి చెందగా ఒక అరుదైన సంఘటన ఈ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలలోకి వెళ్తే గంగుల సుబ్బారావు 30 సంవత్సరాల పాటు సూర్యాపేట పట్టణంలోని గుండా రాములు హోటల్లో వృత్తి నిర్వహిస్తూ నటనపై ఆసక్తితో పౌరాణిక రంగస్థల ప్రదర్శనలు 300కు పైగా ఇచ్చారు. ప్రధానంగా శ్రీకృష్ణుడు, అర్జునుడు, సుయోధన పాత్రలలో ప్రేక్షకులను మెప్పించి అలనాటి రంగస్థలం కళాకారులతో అద్భుత ప్రదర్శనలు రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చారు. ఇటీవల వయోభారంతో దశాబ్ధకాలంగా బీబీగూడెంలో నివాసం ఉంటున్న ఈ పౌరాణిక నటబ్రహ్మ మృతి చెందగా స్థానిక ప్రజలు, ప్రతినిధులు, మహిళలు ఆయన మృతదేహానికి నివాళులర్పించి అంత్యక్రియలు ఘనంగా నిర్వహించడం విశేషం. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పి. సైదులు, మాజీ సర్పంచ్ రాజు నాయక్, వెంకటేశ్వర్లు, లక్ష్మ య్య, దుర్గానందం, సురేష్, నాగరాజు, కళాకారులు గుండా రమేష్, కల్లూరు నాగయ్య, పేరాల సుధీర్‌లతోపాటు పలువురు పాల్గొని జోహార్లు అర్పించారు.

## సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** తెలంగాణ రాష్ట్రంలో సిపిఎస్ (కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు లక్కపాక ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో జనజాగరణ యాత్రలో హాజరై మాట్లాడారు. జూలై 11న ప్రారంభమైన జనజాగరణ యాత్ర 33 జిల్లాలు, 119 నియోజక వర్గాల్లో కొనసాగుతుందని తెలిపారు. అనంతరం ఆగష్టు 23న నిర్వహించే ఛలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కల్వల్ శ్రీకాంత్, గయ్యాని ప్రసాద్, షేక్ యూసుఫ్, నారాయణదాసు సతీష్ కుమార్, మామిడి సురేందర్, చిట్యాల సతీష్, సురభి శేఖర్, వీరారెడ్డి పాల్గొన్నారు.

## ధర్మ రక్షణకు భగవద్గీతే మార్గం

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** నిత్యజీవితంలో ధర్మం, న్యాయం, కర్తవ్య నిర్వహణకు భగవద్గీత గొప్ప మార్గదర్శకమని చిట్యాల సీఐ సిరికొండ సురేష్ అన్నారు.మంగళవారం నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన భగవద్గీత పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా సీఐ సిరికొండ సురేష్ మాట్లాడుతూ, భగవద్గీతలోని బోధనలు మనిషిని సన్మార్గంలో నడిపించడమే కాకుండా, ధర్మాన్ని కాపాడేలా,కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వర్తించేలా ప్రేరేపిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విష్ణు,ఏఎస్ఐ ఆంజనేయులు గౌడ్,ప్రజ్ఞాపురం శ్రవణ్ కుమార్, లీలావతి,పోలీస్ స్టేషన్ సిబ్బంది,కార్యక్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/చింతపల్లి :** రోడ్డు ప్రమాదంలో దంపతుల గాయపడి భర్త చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మంగళవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన ఆలంపల్లి బంగారు(50) వృత్తిరీత్య తాపీ మేస్త్రీ. తన భార్య యాదమ్మ, కుమారదు చరణ్ తేజతో కలసి కుర్మపల్లి గ్రామానికి వెళ్ళి పని ముగించుకొని తిరిగి బైక్‌పై తన సొంత గ్రామానికి వెళుతుండగా, కుర్మేడు వద్ద గల భారత్ పెట్రోల్ బంక్ సమీపానికి రాగానే వెనుక నుండి కారు అజాగ్రతగా, అతివేంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో బంగారు తలకి తీవ్రగాయాలయ్యాయి. చికిత్సనిమిత్తం హైదరాబాదు తరలించగా చికిత్స పొందుతూ బంగారు మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. యాదమ్మకు కుడి చేయి విరగగా, కుమారుడు చరణ్‌తేజకు స్వల్ప గాయాలయినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు ఎస్ఐ తెలిపారు.

## అన్నప్రసాద వితరణ



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** మండల కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి దేవస్థానంలో అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు,అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ప్రతి నెల పౌర్ణమి,అమావాస్య సందర్భంగా నిర్వహించే అన్నప్రసాద కార్యక్రమాన్ని అన్నదాన శ్రీ ధర్మసేవకులు గడగోజు సత్యనారాయణ చారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా దేవస్థానం అర్చకులు బ్రహ్మశ్రీ అనంత ఆచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం దివంగత దోసపాటి మణెమ్మ స్మారకార్థం ఆమె కుమారుడు దోసపాటి వేణు, కోడలు విజయలక్ష్మిఅలాగే బండారు శీను, వరలక్ష్మి దంపతులు 25 కిలోల బియ్యాన్ని అన్నప్రసాద కార్యక్రమానికి విరాళంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో భగవద్గీత పంపిణీ కార్యక్రమ నిర్వాహకులు ప్రజ్ఞాపురం శ్రవణ్ కుమార్,దేవస్థానం వైస్ చైర్మన్ రమేష్, రేపాల శివశంకర్,దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రెండు గడ్డివాములు దగ్ధం

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల పరిధిలోని గారకుంట తండా గ్రామానికిచెందిన గుగులోతు వెంకట్రామ్ నాయక్, గుగులోతు జేత్రంనాయక్ గల రెండు గడ్డివాములు విద్యుత్ అధికారులు సమీపాన ఉన్న స్తంబాల వద్ద విద్యుత్ పనులు చేస్తున్న సందర్భంలో షార్ట్ సర్క్యూట్‌కు గురై గడ్డివాముల మీద పడి రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయని బాధితులు వెంకట్రామ్‌నాయక్ 350 గడ్డిమోపులు, మోటార్ పైపులు, స్టాటర్ పూర్తిగా దగ్గమయ్యాయని అన్నారు. వీటి విలువ సుమారు లక్షల రూపాయల వరకు ఉంటుందని అన్నారు. కరువు సమయంలో గడ్డివాములు దగ్ధమై పశువులకు మేత లేకుండా అయ్యాయని ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఆ కుటుంబ సభ్యులు లబోదిబోమంటున్నారు. విద్యుత్ అధికారులు తక్షణమే స్పందించి కొంతమేర నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

## సదరం క్యాంపు ద్వారా సర్టిఫికెట్‌లు జారీ



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయ మూర్తి ఎ.జయరాజు సూచనల మేరకు సంస్థ కార్యదర్శి వి.మాధవి లత మానసిక వైకల్యం ఉన్న బాల, బాలికలకు ఏర్పాటు చేసిన జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ సేవల పథకం అంశాలపై భువనగిరి పట్టణంలోని భవిత విద్యా వనరుల కేంద్రాన్ని సందర్శించి పాఠశాలలో ఉన్న మానసిక వైకల్యం ఉన్న విద్యార్థిని విద్యార్థులకు సదరం క్యాంపు ద్వారా సర్టిఫికెట్ జారీ అయ్యేటట్లు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనికై పాఠశాల ఉపాధ్యాయుడు రవీందర్ రెడ్డిని తల్లి తండ్రులను సంప్రదించి యుడిఐడి రిజిస్ట్రేషన్ చేయించేలా చర్యలు తీసుకోవాలని దీని ద్వారా వైకల్య సర్టిఫికెట్స్ పొందితే తద్వారా ప్రభుత్వ పథకాలు మంజూరు అవుతాయని తెలిపారు.